క్లుప్తంగా

లేపాక్షి ఆలయం సందర్శన



ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ఐఆర్‌ఎస్ అధికారి నరసింహారెడ్డి

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయాన్ని ఇండియన్ రెవెన్యూ సర్వీసు అధికారి నరసింహారెడ్డి దంపతులు సోమవారం సాయంత్రం సందర్శించారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వామివార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలోని శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించి హర్షం వ్యక్తం చేశారు. వారి వెంట ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్‌తో పాటు పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

హిందూపురం టౌన్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఇప్పటి వరకూ ఈకేవైసీ చేయించుకోని వారు ఈ నెల 5లోపు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీఎస్‌జీఆర్‌ఈ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లప్ప సోమవారం పేర్కొన్నారు. అలాగే ఇప్పటి వరకూ 250 మంది లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించలేదని స్థానిక సబ్ ట్రెజరీ అధికారి ధనుంజయ తెలిపారని, వెంటనే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని వారికి ఏప్రిల్ నుంచి పెన్షన్లు నిలివేశారన్నారు. ఈ నెల 20 లోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

అమరాపురం: మండల కేంద్రంలోని ఓబుల లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం సంప్రొక్షణ పూజా కార్యక్రమాలు నీరు గంటి వంశస్తుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పురోహితులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఉత్సవమూర్తులను ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకులు నరసింహ భట్టాచార్యులు, హరీష్ భట్టాచార్యులు ప్రసాద వినియోగం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

హిందూపురం: డ్రైనేజీ పనులు నాణ్యంగా త్వరగతిన పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. పట్టణంలోని చౌడేశ్వరీ కాలనీలో వద్ద ఐటీఐ కాలేజ్ సమీపంలో రూ.39 లక్షలతో నిర్మిస్తున్న డిస్పోజల్ డ్రైనేజి నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ నీరజ, ఏఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు, గ్రామస్తులు

హిందూపురం: హిందూపురం సమీపంలోని సింగిరెడ్డిపల్లిలో సోమవారం ఊరి జాతర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం గ్రామంలోని నరసింహస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉదయం మహిళలు పెద్ద సంఖ్యలో పూలజ్యోతులను తలపై ఎత్తుకుని మేళతాళలతో పురవీధుల గుండా ఆలయంలో సమర్పించి పూజలు చేపట్టారు. మంగళవారం జరిగే జాతర కార్యక్రమంలో భాగంగా దుర్గమ్మ, ముత్యాలమ్మ, పులేకమ్మ, మారెమ్మ ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలతో పాటు బలిహర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ సీఎం సిద్ధరామయ్య



మాట్లాడుతున్న మాజీ సీఎం సిద్ధరామయ్య

పావగడ: 'స్థానిక విధాన సభ క్షేత్రం అభ్యర్థి హెచ్‌వి వెంకటేశ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించి విధాన సభకు పంపించండి.. అభివృద్ధి పనులకు కోరినన్ని నిధులు పావగడకు మంజూరు చేస్తాం' అని మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. స్థానిక చళ్ళకెర కూడలి వద్ద మైదానంలో సోమవారం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించి ఎవరి పొత్తు లేకుండా సొంతంగానే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు ఏపీ మాజీ మంత్రి రఘువీర, నాయకులు సుధాకర్, కేటీ శ్రీధర్, ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పద్మశ్రీ తదితరులు వెంకటేశ్‌ను గెలిపించాలని కోరారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం

- అన్ని ప్రాంతాల్లో శ్రమ జీవుల ర్యాలీ, మానవహారాలు
- హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించాలన్న ఏడీజే శైలజ



హిందూపురం: న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న ఏడీజే శైలజ



అమరాపురం: మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు



పెనుకొండ: ప్రసంగిస్తున్న జడ్జి శంకరరావు



పరిగి: మిల్లు వద్ద జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



హిందూపురం: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు

హిందూపురం టౌన్: హిందూపురం పట్టణ వ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలతో కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్న మార్కెట్ నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అనుబంధ సంఘాలు ఏకమై పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల సీఐటీయూ జెండాలను ఆవిష్కరించి కేక్ కట్ చేసి మేడే వేడుకలను జరుపుకున్నారు. అలాగే ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద మేడే వేడుకలను జరుపుకున్నారు. తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పారిశ్రామిక వాడలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాన్ని చేసిందన్నారు. స్కీం వర్కర్స్‌కు ఈఎస్‌ఐ, పీఎఫ్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మడకశిర: నల్ల చట్టాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు కోరారు. సోమవారం పట్టణంలో జరిగిన మేడే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం, ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట ఆయన జెండా ఆవిష్కరించారు. అదే విధంగా హిందూపురం రోడ్డులో భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల యూనియన్ ఆటో స్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో కూడా స్థానిక ఎస్‌ఐ సురేష్‌బాబుతో పాటు ఆయన పాల్గొని భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తోందని ధ్వజ మెత్తారు. అలాగే పట్టణంలోని గోదాములో సివిల్ సప్లయ్స్ యూనియన్ కార్మికుల ఆధ్వర్యంలో సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు జెండా ఆవిష్కరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, ఉష, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు సౌభాగ్య, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్, డ్రైవర్ల సంఘం నాయకులు ప్రసాద్, కరియన్న తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: సమాజంలో కష్ట జీవులు కార్మికులేనని, శ్రమను నమ్ముకుని నిత్యం సుఖదుఃఖాలు లెక్క చేయకుండా కార్మిక శక్తిని చాటుతూ ఎన్నో వ్యవస్థల్లో కార్మికులు విలువలు చాటుకుంటున్నారని సీపీఐ నాయకుడు నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం లేపాక్షిలోని నీలం రాజశేఖర్‌రెడ్డి నగర్‌లో మేడే సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శివప్ప, సహాయక కార్యాదర్శి మంజునాథ్, ఐదుకల్లు సదాశివనగర్ శాఖ కార్యదర్శి మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: అమరాపురంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

గోరంట్ల: మండల కేంద్రంలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం (మేడే) వేడుకలను పవర్‌లూమ్స్ కార్మికులు ఘనంగా నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో పవర్‌లూమ్స్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు సుధాకర్,ఏఐఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్ రెడ్డి, అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి మనోహన్, ట్రెజరర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మేడే వేడుకలను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మండల కేంద్రంతో పాటు కొడికొండ చెక్‌పోస్ట్, దేమకేతేపల్లి గ్రామాల్లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. దేమకేతేపల్లి ఎస్‌బీఐ వద్ద మేడే వేడుకలను సర్పంచ్ తిరుమలేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ కార్మికులకు ప్రభుత్వాలు అన్ని విధలా అండగా నిలవాలన్నారు. కార్యక్రమాల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పోరాట హక్కుల ఫలితమే మేడే అని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోర్టు ఆవరణంలో జరిగిన మేడే వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి పాల్గొని చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి పసల ముజీబ్, ఏజీపీ భాస్కరరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలో భారీ లారీ డ్రైవర్, క్లీనర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ఏజీపీ భాస్కరరెడ్డి పాల్గొని జెండా ఎగురవేశారు. అదే విధంగా సీఐటీయు, సీపీఐల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి.

హిందూపురం: కార్మికులందరూ హక్కులతో పాటు బాధ్యతలను గుర్తించి నిబద్ధతతో వ్యవహరించాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఏడీజే శైలజ మాట్లాడుతూ ఎందరో కార్మిక నేతల త్యాగాల ఫలితమే కార్మిక దినోత్సవమన్నారు. కార్మిక చట్టాలకు అనుగుణంగా కార్మికులు మానసిక, శారీరక, ఆర్థికాభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. వృత్తిలో నైపుణ్యం, మెళకువలను పెంపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ జీఆర్ సిద్దు, న్యాయవాదులు కళావతి, పార్వతి, రవికుమార్, లోక్ అదాలత్ సభ్యులు శారద, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: సీఐటీయూ అనుబంధ సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం మేడేను ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో వివిధ గ్రామాలకు చెందిన అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పట్టణానికి చేరుకుని గ్రామ పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భం అగళి రోడ్డులో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత వైఎస్సార్ సర్కిల్ బస్టాండ్ ఆవరణం చేరుకుని మానవహారం నిర్వహించారు. అనంతరం బస్టాండ్‌లో జెండాను ఎగుర వేశారు.

సోమందేపల్లి: సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమందేపల్లిలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద కార్మికుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజగోపాల్, పెద్దన్న, బాలస్వామి, హనుమయ్య, చాంద్ బాషా పాల్గొన్నారు.

పరిగి: ప్రపంచ కార్మికులంతా ఏకం కండి అన్న విప్లవ నాయకుడు, మహాకవి శ్రీరంగం శ్రీనివాస రావు మాటలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్మికుడు మెలగాలని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలో కార్మికులు మే డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కొడిగెనహళ్లి ప్రీకాట్ మెరీడియన్ స్పిన్నింగ్ మిల్లులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో తొలుత జెండా ఆవిష్కరణ చేశారు. అలాగే పరిగిలోని సచివాలయం వద్ద మేడే వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, రైతు, వ్యవసాయ సంఘాలు, ఆటో యూనియన్‌లు, ట్రేడ్ యూనియన్, పారిశుధ్య కార్మికులు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



హిందూపురంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ రామాంజినేయులు

హిందూపురం టౌన్: మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న హమాలీల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని మార్కెటింగ్‌శాఖ కడప జేడీ రామాంజినేయులు అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ హమాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో హమాలీల రిటైర్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా జేడీ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. జేడీ మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీలకు ప్రభుత్వ అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందన్నారు. హమాలీలకు మార్కెట్ కమిటీ నుంచి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా హమాలీలు పలు సమస్యలను జేడీ దృష్టికి తీసుకురాగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ టోకెన్లు లేని హమాలీలకు టోకెన్లు, ఈఎస్‌ఐ వర్తింపు చేయాలన్నారు. అలాగే కార్మికులందరికీ ఒకే ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేసేలా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ దృష్టికి, మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం రిటైర్డ్ అయిన హమాలీలకు శాలువాలతో సత్కరించారు. అదే విధంగా మార్కెట్ యార్డులో మేడే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండి అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, అధ్యక్షుడు నారాయణప్ప, ముజంమీల్, హమాలీలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా వెలుగు



గుణేమోరుబాగల్‌లో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



సోమందేపల్లి: లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

- ఎమ్మెల్యేలు శంకరనారాయణ, తిప్పేస్వామి

సోమందేపల్లి: కుల, మత, ప్రాంతం, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే అందిస్తున్నామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చాలకూరు, రేణుకానగర్‌లో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల వర్తింపు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధి పొందిన పథకాలను సంబంధించిన బుక్‌లెట్ అందజేసి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని అన్నారు. కానీ ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే వచ్చి అర్హులను గుర్తించి పథకాలు చేరువ చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంట్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. ఇంకా అర్హత ఉండి ఎవరికైనా పథకాల అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే గడప వద్దకే వచ్చి వలంటీర్లు పథకాలు అందజేస్తారని చెప్పారు. గత ముప్పై ఏళ్ల పాటు టీడీపీ ఎమ్మెల్యేలు గెలిచిన ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజురావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, సర్పంచ్ లలితా, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, స్థానిక నాయకులు లక్ష్మి నరసప్ప, చంద్రశేఖర్ రెడ్డి, షఫీ, పరంధామ, అంజినప్ప, రామ్మోహన్‌రెడ్డి, అంజినరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పక్కాగా నవరత్నాలను అమలు చేస్తూ ఇంటింటా వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుణేమోరుబాగల్ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అనే విషయం లబ్ధిదారులతో ఆరా తీశారు. కొందరు ఇళ్లు మంజూరు చేయాలని విన్నవించారు. పొలాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని రైతులు కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఏ ఒక్క పనిని ప్రజలు గుర్తుండిపోయేలా చేయలేదన్నారు. అందువల్ల బాబును ప్రజలు తిరస్కరించారన్నారు. త్వరలోనే మండలానికి హంద్రీనీవా జలాలు వస్తాయన్నారు. చంద్రబాబు కోసమే పవన్ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రజల మనసులో జగన్ హీరో అయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మార్కెట్ యార్డ్ చైర్మన్ జయరామ్, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచ్ యంజారేగౌడు, మండల సచివాలయ కన్వీనర్ కె.శివ కుమార్, ఎస్సీ సెల్ కన్వీనర్ పాండు, రమేష్, నాగరాజ్‌గుప్త, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం..రైతులకు తీవ్ర నష్టం



దొమ్మరహట్టి వద్ద నేలకూలిన వాటర్ స్కీమ్ ట్రాన్స్‌ఫార్మర్



ఈదురు గాలులకు రాలిన మామిడి కాయలు చూపిస్తున్న రైతు నాగేంద్రప్ప

రొళ్ల: అకాల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆదివారం రాత్రి రొళ్ల మండలంలోని బీజీ హళ్లి, కాకి, హులికుంట, దొడ్డేరి, రొళ్ల తదితర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. టీడీ పల్లిలో రైతులు రవికుమార్, ఈశ్వరప్ప, నాగేంద్రప్ప మామిడి తోటలో కాయలు రాలి పోవడంతో రూ.లక్ష పైగా నష్టం వాటిల్లింది. సంబంధిత ఉద్యానవనశాఖ అధికారులు చర్యలు తీసుకుని గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచన వేసి పరిహారం చెల్లించాలని రైతులు కోరారు. అలాగే దొమ్మరహట్టిలో వాటర్ స్కీమ్ పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నేల కూలింది.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించిన దృశ్యం

హిందూపురం: హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఆవరణంలో జరిగిన జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన ఏడుగురు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు అభినందించారు. విప్రోకు రజిని, నందిని, తనుజ, పూజిత, చెన్నై ఫస్ట్ సోలార్‌లో హరి కీర్తన, బెంగళూరు కల్పతరు పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీకు లాల్‌బీ, సరిత ఎంపికైనట్లు చెప్పారు.

జోరుగా పింఛన్ పంపిణీ



జమ్మానిపల్లిలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సోమవారం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. సెలవు రోజైనా ముఖ్యమంత్రి జగనన్న పింఛన్ వచ్చేలా చూశారని పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు.

ఇసుక రీచ్ వద్ద ఆందోళన



ఇసుక రీచ్ వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళీ నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. సోమవారం ఇసుక రీచ్ వద్దకు చేరుకుని ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లతో పాటూ తవ్వుతున్న ఇటాచీ వాహనాలను నిలిపివేయించారు. పోలీసులకు, నాయకులకు మధ్య జరిగిన వాగ్వాదంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ నాయకుడు ప్రభాకర్, మండల కన్వీనర్ నరసింహమూర్తి, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సర్పంచ్ మంజునాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు పొందిన చోట కాకుండా వేరే ప్రాంతంలో ఇసుకను తవ్వి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనుమతి ఇచ్చిన దానికన్నా ఎక్కువ తవ్వేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో సర్పంచ్ శివశంకర్, ఎంపీటీసీ సభ్యులు చంద్రారెడ్డి, మారుతీరెడ్డి, చిక్కన్న, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మైనార్టీ నాయకుడు రఫీక్, మున్నా, సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

గోరంట్ల: మండల పరిధిలోని వెంకటరమణ పల్లి పంచాయతీ పెరుమాళ్ల పల్లి గ్రామంలో సోమవారం బూదలింగేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గణపతి పూజ, నవగ్రహ పూజ, ఈశ్వర పంచామృత రుద్రాభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం కళాకారులచే నృత్య ప్రదర్శనలతో జ్యోతులు, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి 9 గంటల నుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

హిందూపురం: నూతనంగా ఏర్పడిన హిందూపురం పోలీస్ సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతలు, ట్రాఫిక్, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని డీఎస్పీ పి.కంజాక్షన్ అన్నారు. స్థానిక టుటౌన్ పోలీసుస్టేషన్ మేడపై ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయ ప్రారంభం సందర్భంగా పూజలు నిర్వహించారు. తర్వాత సీఐలు వెంకటేశ్వర్లు, ఈరన్న, కృష్ణారెడ్డి, వేణుగోపాల్, ఎస్ఐలు... డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం డీఎస్పీ కంజాక్షన్ విలేకరులతో మాట్లాడుతూ సబ్‌డివిజన్‌లోని పోలీసుస్టేషన్‌లో అధికారులు, సిబ్బంది పనితీరు మెరుగుపరుస్తూ ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ కంజాక్షన్‌ను కలిసిన సీఐ, ఎస్‌ఐలు

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం పరిధిలోని మిషన్ తండా, పొప్పనపల్లి తండా, కొత్తూరు, బెల్లాల చెరువు గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9705346587
9010200238, 9912220726